# యూరియా కొరత.. రైతుల వ్యథ!

- ఆత్మకూరు మండలంలో యూరియా కోసం కర్షకుల పాట్లు
- పంటలకు సరిపోను అందుబాటులో ఉంచాలని వేడుకోలు

**ఆత్మకూర్ (ఎస్) :** ఆత్మకూరు మండలవ్యాప్తంగా రైతులు యూరియా కోసం తిప్పలు పడుతున్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రాలతో పాటు ఇతర ప్రైవేటు దుకాణాల్లోనూ యూరియా కరువైంది. మండలంలోనే కాకుండా సూర్యాపేటలోని పలు దుకాణాల్లోనూ యూరియా ఒక్కటే ఇచ్చేందుకు యజమానులు ముందుకు రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఏదో ఒక గుళికలను అంటకట్టి యూరియా ఇస్తున్నారని వాపోతున్నారు.

**ఆందోళన చెందుతున్న రైతులు..**

మండలంలో 42,879 ఎకరాల్లో వివిధ పంటలు సాగులో ఉన్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. వరి సాగు అత్యధిక విస్తీర్ణంలో ఉండగా.. తర్వాతి స్థానంలో పత్తి ఉంది. మొదట నాట్లు వేసిన పొలా లకు ఇప్పటికే నెలరోజులు అవుతుండడగా.. చివరగా వేసిన వాటికి 15 రోజులవుతోంది. ఈ సమయంలో మొదటి, రెండవ విడత పొలాలకు యూరియా వేయాల్సి ఉంది. కానీ యూరియా కొరత కారణంగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నెమ్మికల్ పీఏసీఎస్ కేంద్రం వద్ద యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

**పత్తి సాగులోనూ..**

ఆగస్టు మొదటి మూడు వారాల పాటు వర్షాలు లేక పోవడంతో చాలా మంది రైతులు పత్తి పంటకు మందులు పెట్టలేదు. చివరి వారంలో కురిసిన ఒక ట్రెండు వర్షాలకు మందు పెట్టాలని చూసినా ఎక్కడా యూరియా దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**తప్పని తిప్పలు..**

ఓ వైపు పొలాలకు.. మరోవైపు పత్తి పంటకు యూరియా అవసరం ఎక్కువగా ఉండగా.. రైతులు నానా తిప్పలు పడుతున్నారు. మండల పరిధిలోని ఏపూరు ప్రాథమిక పరపతి సంఘానికి వస్తున్న యూరియా వెంటనే అయిపోతోంది. ముందుగా వచ్చిన రైతులకే ఈ యూరియా సరిపోతుండగా చాలామంది రైతులు వెనుదిరిగి పోతున్న పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా వెంటవెంటనే యూరియాను తెప్పించాలని మండల రైతులు కోరుకుంటున్నారు.

**యూరియా దొరకడం లేదు**



మండలంలో ఎక్కడా యూరియా దొరకడం లేదు. రైతులు చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి యూరియా లేకపోవడంతో పంటల ఎదుగుదల లోపిస్తుందని ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి యూరియాను అందుబాటులోకి తీసుకురావాలి.

- అవిరె అప్పయ్య, రైతు

**కొరత వల్ల ఇబ్బంది పడుతున్నాం**



పొలానికి మొదటి విడత యూరియా చల్లే సమయం వచ్చింది. మండలంలోని పీఏసీఎస్ సెంటర్‌తో పాటు ప్రైవేటు దుకాణాల్లోనూ అందుబాటులో లేదు. డీఏపీ ఉన్నప్పటికీ యూరియా మాత్రం దొరకడం లేదు. ఆత్మకూరులోని భవనం శిథిలావస్థకు చేరడంతో స్టాక్ వేయడం లేదు. నాతో పాటు చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- సోమిరెడ్డి దామోదర్‌రెడ్డి, రైతు

# ఘనంగా బోనాల పండుగ



చిన్నెమిలలో బోనాలను ఎత్తుకెళ్తున్న మహిళలు

**మద్దిరాల :** చిన్ననెమిల గ్రామంలో మడేలయ్యా స్వామి ఆలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం గ్రామస్తులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.



పెన్‌పహాడ్ : లింగాలలో..

**పెన్‌పహాడ్ :** పెన్‌పహాడ్ మండలపరిధిలోని లింగాల గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో గ్రామ సర్పంచ్ మామిడి వెంకన్నగౌడ్, ఉప సర్పంచ్ కనకమ్మ, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ స్కూల్‌కు వెంపటి విద్యార్థుల ఎంపిక

**తుంగతుర్తి :** రాష్ట్రంలో శనివారం ప్రకటించిన స్పోర్ట్స్ స్కూల్ ఫలితాల్లో వెంపటి పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గతంలో సూర్యాపేట జిల్లా నుంచి 45 మంది విద్యార్థులను స్పోర్ట్స్ స్కూల్ సెలెక్ట్‌కు పంపారు. జిల్లా నుంచి 16 మంది విద్యార్థులు ఎంపికవగా వారిలో తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు 13 మంది ఉన్నారు. 4వ తరగతి నుంచి ఆరుగురు, ఐదవ తరగతి నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరందరికీ హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలలో సీటు లభించింది. ఒకే పాఠశాలకు చెందిన విద్యార్థులు 13 మంది ఎంపిక కావడంతో ఎంఈఓ బోయిని లింగయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకట రామనరసమ్మ, ఉపాధ్యాయులను అభినందించారు.



స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థులు

# కార్మికులకు అండగా ఎమ్మెల్యే కిషోర్

**తుంగతుర్తి :** ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ కార్మికులకు అండగా ఉంటున్నారని బీఆర్‌ఎస్‌కేవీ నియోజకవర్గ బాధ్యుడు గౌడిచర్ల సత్యనారాయణ అన్నారు. తుంగతుర్తి మండలంలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికురాలు గోరంట్ల ఉప్పమ్మ ఇటీవల అనారోగ్యం మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులను ఆదివారం ఆయన పరామర్శించి మాట్లాడారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుంచి రూ. 3 లక్షల చెక్కును ఎమ్మెల్యే సహకారంతో బాధిత కుటుంబానికి అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బీఆర్‌ఎస్‌కేవీ గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుడిపాటి సైదులు, ఉపాధ్యక్షుడిగా చింతకుంట్ల వెంకన్న, కార్యదర్శిగా పాక వెంకన్న ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మామిడి వెంకన్న, ఎంపీటీసీ మట్టపల్లి కవిత, ఉపసర్పంచ్ పరమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లెపాక రాములు, యాకుబ్, మండల ఉపాధ్యక్షుడు సోమేష్, కుంభం మహేష్, గుడిపాటి వీరన్న, మట్టపల్లి కుమార్, పాలడుగు జలేందర్, పోలేపాక రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడున్న బీఆర్‌ఎస్‌కేవీ నాయకులు

# మంత్రికి అండగా ఉంటున్నామనే ఆరోపణలు



మాట్లాడుతున్న తాళ్లగడ్డ గౌడ నాయకులు

**భానుపురి :** తాళ్లగడ్డ చుట్టూ మినీట్యాంక్ బండ్, మెడికల్ కాలేజీ, ఎస్పీ కార్యాలయం తీసుకొచ్చి అభివృద్ధి చేసిన మంత్రి జగదీష్ రెడ్డికి ఇక్కడి ప్రజలు అండగా ఉంటున్నారన్న కారణంగానే బీజేపీ నాయకుడు సంకినేని వెంకటేశ్వరరావు తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తాళ్లగడ్డ బీఆర్‌ఎస్ గౌడ నాయకులు అన్నారు. ఆదివారం తాళ్లగడ్డలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సంకినేని వెంకటేశ్వరరావు ఆరోపించినట్లు తాము ఎక్కడైనా భూములు ఆక్రమించినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని తెలిపారు. నిరూపించ లేకపోతే రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా సంకినేని తప్పుకుంటాడా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, బైరు దుర్గయ్యగౌడ్, కక్కిరేణి నాగయ్యగౌడ్, అనంతుల యాదగిరిగౌడ్, బూర బాలసైదులుగౌడ్, బైరు వెంకన్నగౌడ్, పల్స వెంకన్న గౌడ్, కక్కిరేణి సత్యనారాయణగౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న నాయకులు

**తిరుమలగిరి :** జలాల్‌పురం గ్రామానికి చెందిన వేముల ఉప్పలయ్య, తెడ్డు సోమన్న, భోక్యా నాయక్ తండాకు చెందిన రూప్‌సింగ్ అనే రైతులకు చెందిన గేదెలు విద్యుదాఘాతంతో మృతిచెందాయి. దీంతో ఈ ముగ్గురు రైతులకు రూ.40 వేల చొప్పున మంజూరైన చెక్కులను విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తెడ్డు భాస్కర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జానయ్యపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

**సూర్యాపేట రూరల్ :** డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్‌పై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఖమ్మం జిల్లా తాపీ మేస్త్రీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వట్టె జానయ్య యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. బహుజనులకు రాజ్యాధికారం రావాలంటే అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. పది సంవత్సరాలుగా కనబడని అక్రమాలు మంత్రిని విమర్శిస్తే కనబడ్డాయా అని ప్రశ్నించారు. అధికార బలంతో పెట్టిన అక్రమ కేసులు ఎప్పటికీ నిలబడవని అన్నారు. బీసీలను అణగదొక్కాలని చూస్తే రానున్న ఎన్నికల్లో బీసీల దమ్మేందో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు కుమ్మరికుంట్ల వెంకటనారాయణ, అనిశెట్టి శంకరయ్య, గుడిపాటి ముత్యాలు, ఎల్లయ్య, సుంకర వెంకటనారాయణ, గోపాలు, వెంకన్న, నాగేశ్వరరావు, జానయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాపీ మేస్త్రీ సంఘం నాయకులు

# పార్టీ బలోపేతంలో కీలకపాత్ర



పిట్టా రాంరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

**సూర్యాపేట :** వైఎస్సార్ తెలంగాణ పార్టీ బలోపేతంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్టా రాంరెడ్డి కీలకపాత్ర పోషిస్తున్నారని సూర్యాపేట జిల్లా నాయకుడు, మహబూబ్‌నగర్ జిల్లా పరిశీలకుడు బీరెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పిట్టా రాంరెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఆయనను సూర్యాపేట నియోజకవర్గ నాయకులతో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. షర్మిల చేపట్టిన పాదయాత్రలో పిట్టా రాంరెడ్డి ఆమెతో పాటు 3800 కిలోమీటర్లు నడిచారని, వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోడంగి గంగాధర్‌యాదవ్, రాష్ట్ర యూత్ కోఆర్డినేటర్ మహమ్మద్ రఫీ, ఇరుగు శాంతి కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత లోపించే.. ఉపయోగం లేదాయే

- సూర్యాపేట – జనగామ హైవే బస్ షెల్టర్ల నిర్మాణంలో ఇష్టారీతిన పనులు
- నాణ్యత లేకపోవడంతో ఐదేళ్లలోనే ధ్వంసమైన ప్రాంగణాలు
- సుమారు రూ.1.50కోట్లు వృథా

**అర్వపల్లి :** సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డు వెంట నిర్మించిన బస్‌షెల్టర్‌లు అప్పుడే ధ్వంసమైపోయాయి. ఈ షెల్టర్‌ల నిర్మాణంలో నాణ్యత లోపించి ఎక్కడికక్కడ తుప్పుపట్టి పోయాయి. చాలా చోట్ల షెల్టర్ల రేకులు కూడా లేకుండాపోయాయి. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్ షెల్టర్‌లు మూన్నాళ్ల ముచ్చటగానే మారాయి.



రామన్నగూడెంలో శిథిలమైన బస్‌షెల్టర్

**ఐదేళ్లలోనే నిరుపయోగంగా..**

సూర్యాపేట–జనగామ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సూర్యాపేట నుంచి తిరుమలగిరి వరకు 45 కిలోమీటర్ల పొడవున 25 వరకు బస్‌షెల్టర్‌లను నిర్మించారు. ఇందుకోసం సుమారు రూ. 1.50కోట్లు ఖర్చు చేశారు. 2018లో ఈ బస్‌షెల్టర్‌ల నిర్మాణం జరిగింది. అయితే ప్రస్తుతం ఈ షెల్టర్‌ల పైకప్పు రేకులు ఎక్కడికక్కడ ధ్వంసమయ్యాయి. ఇనుముతో షెల్టర్ల నిర్మాణం చేపట్టడంతో ఎక్కడికక్కడ తుప్పుపట్టి ప్రయాణికులు కూర్చోలేని విధంగా మారాయి. నిరుపయోగంగా మారిన బస్‌షెల్టర్‌లను వెంటనే మరమ్మతు చేయించి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పర్సాయపల్లిలో..

**రెండు బస్‌షెల్టర్‌లు పాడయ్యాయి**



సూర్యాపేట–జనగామ హైవేపై రామన్నగూడెం వద్ద రోడ్డుకు ఇరువైపులా రెండు బస్‌షెల్టర్లు నిర్మించారు. ఒక బస్‌షెల్టర్ పూర్తిగా ఓ వైపు ఒరిగిపోయి పాడైపోయింది. మరోటి తుప్పు పట్టిపోయింది. బస్ షెల్టర్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలి.

- వజ్జె సాయి, రామన్నగూడెం

**నిరుపయోగంగా మారాయి**



365బీ హైవేపై నిర్మించిన బస్‌షెల్టర్ల పనుల్లో నాణ్యత లోపించి పాడయ్యాయి. ఇవి నిర్మించినప్పటి నుంచి నాణ్యతలోపంతో ప్రయాణికులు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. హైవే అధికారులు వీటి స్థానాల్లో కొత్త బస్‌షెల్టర్లు నిర్మించాలి.

- కోనేటి వెంకన్న, తిమ్మాపురం

# రైతులకు రుణ 'సహకారం'

- అన్నదాతలకు అండగా నారాయణగూడెం పీఏసీఎస్
- అవసరమైన వారికి సకాలంలో సాగుసాయం

**పెన్‌పహాడ్ :** పెన్‌పహాడ్ మండలంలోని నారాయణగూడెం ప్రాథమిక సహకార సంఘం రైతులకు ఏటా పంట రుణాలు అందిస్తూ అండగా నిలుస్తోంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో మొత్తం 10 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 2860 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరికి ఏటా ప్రభుత్వం పంట పెట్టుబడి రుణాలను అందిస్తోంది. అవసరమైన రైతులకు దీర్ఘకాలిక రుణాలను ఇస్తోంది. ఇప్పటికే వానాకాలం సీజన్‌లో పంట రుణాల కోసం రూ.25 లక్షలు అందజేసింది. రుణమాఫీ అయిన రైతులు తీసుకున్న రుణాల్లో మిగిలిన డబ్బును చెల్లించి, కొత్త రుణాలు పొందాలని పీఏసీఎస్ అధికారులు సూచిస్తున్నారు.

**దీర్ఘకాలిక రుణాలు..**

రాష్ట్ర ప్రభుత్వం పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు దీర్ఘకాలిక రుణాలను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నారాయణగూడెం పీఏసీఎస్‌కు రూ. 80లక్షలు దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేసింది. గొర్లు, బర్రెలు, మేకలు, ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, భూమి చదును చేసే కల్టివేటర్లు, పౌల్ట్రీ ఫాం, పశువుల షెడ్లు, వ్యవసాయ పనిముట్ల కోసం రైతులకు ఈ రుణాలను అందజేస్తున్నారు.




నారాయణగూడెం సహకార సంఘ కార్యాలయం

**వేగంగా ధాన్యం కొనుగోళ్లు...**

రైతులు పండించిన ధాన్యాన్ని పీఏసీఎస్ ప్రతి ఏటా కొనుగోలు చేస్తోంది. గత వానాకాలం, యాసంగి సీజన్‌లో రైతులు పండించిన వరిని నిర్ణీత సమయంలో కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసింది. నారాయణగూడెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో అనంతారంలో రైతులకు ఎరువుల కోసం గోదామును నిర్మించి అందుబాటులోకి తెచ్చారు.


**వినియోగించుకోవాలి**



నారాయణగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు పంట రుణాలతోపాటు దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నాం. ఇప్పటికే పీఏసీఎస్ ద్వారా కొంతమంది రైతులకు దీర్ఘకాలిక రుణాలను అందించాం. సంఘంలో సభ్యత్వం కలిగి ఉన్న రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి.

- నాతాల జానకిరాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్

**రైతుల అభ్యున్నతికి కృషి**



రైతుల అభ్యున్నతికి పీఏసీఎస్ ఎంతో కృషి చేస్తోంది. ఇందులో సభ్యత్వం ఉన్న రైతులకు రుణాలు ఇస్తున్నాం. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే మళ్లీ రుణాలు పొందేందుకు వీలుంటుంది. రైతులు పీఏసీఎస్ సేవలు వినియోగించుకోవాలి.

- అలకుంట్ల సైదులు, సీఈఓ, పీఏసీఎస్

# ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇచ్చిన వారికే మద్దతు

**కోదాడ :** మలిదశ తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించిన పార్టీలకే విద్యార్థుల మద్దతు ఉంటుందని ఓయూ జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 17న కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో 'గద్దర్ యాదిలో' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించామన్నారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కందుల మధు, ఎస్ఎం శ్రీకాంత్‌యాదవ్, మాతంగి మురళి, వినోద్, రవినాయక్, వీరబాబు, నవీన్, బండి గోపి, చింతల సాయిగోపి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

# ఫార్మసీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

**సూర్యాపేట రూరల్ :** మండల పరిధిలోని రాయినిగూడెంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ చాన్సులర్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యకళాశాల సూపరింటెండెంట్ ప్రొఫెసర్ మురళీధర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు పతకాలను బహూకరించి, డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవులపల్లి వినయ్‌కుమార్, డాక్టర్ కిషోర్, నీలమ్మ, టీఎస్‌రావు, నవీన్, మహేష్, భవాని, శృతి, పర్వీన్, శ్రీలత, సుజాత, రాంబాబు, శైలజ, నరేష్, భవాని, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ పట్టాలు ప్రదానం చేస్తున్న ప్రొఫెసర్‌లు

# ముగిసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు



నూతనకల్ : ఓటరు లిస్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ వీరబ్రహ్మచారి

**తిరుమలగిరి :** మండలంలో రెండు రోజులుగా నిర్వహించిన ఓటరు నమోదు శిబిరాలు ఆదివారం ముగిశాయి. ఈ శిబిరాలను తహసీల్దార్ రమణారెడ్డి ఆదివారం పరిశీలించి మాట్లాడారు. 2023 అక్టోబర్ 1 నాటికి పద్దెనిమిదేళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఓటరు నమోదు, తప్పుల సవరణనకు ఈ నెల 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్ ఉన్నారు.

**అర్వపల్లి :** మండల వ్యాప్తంగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఆదివారంతో ముగిసాయి. 18ఏళ్లు నిండిన, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే వారంతా కొత్తగా ఓటు హక్కు పొందడానికి దరఖాస్తులు చేశారని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్‌లు తెలిపారు. ఈ ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలలో 500కు పైగానే దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కంట్లమయ్య, ఆర్ఐ కరుణాకర్, బీఎల్‌ఓలు నవనీత, సునంద తదితరులు పాల్గొన్నారు.

**అర్హులను ఓటరుగా నమోదు చేయాలి**

**నూతనకల్ :** అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని ఆర్డీఓ వీరబ్రహ్మచారి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్‌లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, నాయబ్ తహసీల్దార్ శ్రీధర్‌నాయక్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

**ఓటరు నమోదు శిబిరం పరిశీలన**

**మద్దిరాల :** అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కుక్కడంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓ హైమావతి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్‌ఓలు



మద్దిరాల : కుక్కడంలో ఓటరు నమోదు..

# ఆర్మీ లెఫ్టినెంట్‌కు సన్మానం

**అర్వపల్లి :** అర్వపల్లికి చెందిన రిటైర్డు జవాన్ ఇమ్మడి సోమయ్య–కవితల కుమారుడు, ఆర్మీ లెఫ్టినెంట్ ఇమ్మడి పవన్‌ను ఆదివారం అర్వపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మారుమూల ప్రాంతం నుంచి ఆర్మీ లెఫ్టినెంట్‌గా ఎంపికై ఏడాది పాటు పనిచేసి స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా అతడిని సన్మానించినట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పగిళ్ల శంకర్, కూర శంకర్, చవ్వ సురేష్, వేముల సత్తయ్య, అనిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

**నూతనకల్ :** తమ బాల్య స్నేహితుడి మాతృమూర్తి ఇటీవల మృతి చెందగా స్నేహితులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన మహేశ్వరం మాణిక్యం మాతృమూర్తి భిక్షమ్మ ఇటీవల మృతిచెందింది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000విద్యా సంవత్సరానికి చెందిన కొంత మంది పూర్వ విద్యార్థులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చామకూరి శ్రీధర్, బీమిడి సుభాష్‌రెడ్డి, ఇమ్మారెడ్డి దయాకర్‌రెడ్డి, బొడ్డుపల్లి ముత్తయ్య, మురళి, మధుసూదన్‌రెడ్డి, రవి, ఈదయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలు నివారించాలి

**నడిగూడెం :** మండల పరిధిలోని రామాపురంలో కొద్ది రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారని, విద్యుత్ కోతలను నివారించాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు నేలమర్రి శ్యామ్ ఆదివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. సమయపాలన లేకుండా ఇష్టారాజ్యంగా విద్యుత్ కోత విధిస్తుండడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## క్లుప్తంగా

### నేడు కంటి వైద్యశిబిరం

**భానుపురి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సోమవారం వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సీవిజన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే వైద్యపరీక్షలకు పెన్షనర్లు తమ హెల్త్ కార్డులు వెంట తెచ్చుకోవాలని కోరారు.

### ఎస్ఐగా ఎంపికైన యువకుడికి సన్మానం



సన్మానిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

**చివ్వెంల :** ఇటీవల ప్రకటించిన ఎస్ఐ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన మండల పరిధిలోని గుంజలూరు గ్రామానికి చెందిన వీరబోయిన సైదులును గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకరి లక్ష్మమ్మ, ఉపసర్పంచ్ దొనకొండ సైదులు, హన్మంతరావు, వీరయ్య, వెంకటేశ్వర్లు, లింగారెడ్డి, పరశురాములు పాల్గొన్నారు.

### బీటీ రెన్యువల్ చేపట్టాలి

**అర్వపల్లి :** కాసర్లపహాడ్–కొమ్మాల బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నందున అధికారులు వెంటనే బీటీ రెన్యూవల్ పనులు చేపట్టాలని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చ నర్సయ్య కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రోడ్డు పూర్తిగా గుంతలమయమై కంకర తేలిందని తెలిపారు. ఈ రోడ్డు ప్రధాన రహదారి కావడంతో చుట్టూ 10 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని అన్నారు. వెంటనే రెన్యూవల్ పనులు చేపట్టి ఇబ్బందులు తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఫాగింగ్ నిర్వహిస్తున్న జీపీ సిబ్బంది

**నూతనకల్ :** గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోని వ్యాధుల బారి నుంచి కాపాడుకోవాలని సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దోమల వ్యాప్తి నివారణకు కృషి చేసినట్లయితే వ్యాధులను నియంత్రించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### లేడీస్ టైలర్స్ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

**భానుపురి :** సూర్యాపేట పట్టణ లేడీస్ టైలర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా డి. చంద్రకళ, ఉపాధ్యక్షురాలిగా కీర్తి వెంకటేశ్వర్లు, సెక్రటరీలుగా జగదీష్, విజయ్, జాయింట్ సెక్రటరీగా చంద్రశేఖర్, ట్రెజరర్‌గా సంపత్, సభ్యులుగా శివాని, శ్రీలత, సుమలత, ఎస్కే అయేషా, స్వాతి, కమల ఎన్నికయ్యారు.

### సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

**నాగారం :** ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని ఫణిగిరి సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాస్టర్ రత్నాకర్ మాట్లాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అన్నారు. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు చిలుకూరి యాకోబు, చిలుకూరి శ్రీలత, చిలుకూరి లావణ్యలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి సభ్యులు ముదిగొండ లాజర్, కర్నే మాణిక్యం, యాట భాస్కర్, జయరాజు, కిరణ్, ప్రకాష్, ముదిగొండ కళమ్మ, మరియమ్మ, ధనమ్మ, సంగెం యాదమ్మ, యాట వసంత, యాట మంజుల, స్వరూప, కవిత, కరుణ, యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఫణిగిరిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సీఎస్ఐ చర్చి సభ్యులు